

వరిలో సస్యరక్షణ ముఖ్యం

రైతులు పండిస్తేనే మానవాళి కడుపు నిండేది. ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి సీజన్ ప్రారంభమైంది. 8లో▸



సమాజ హితానికి భగవద్గీత

అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతివనంలో శుక్రవారం గీతోపదేశ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించారు. 8లో▸



గంజాయి పట్టివేత

గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మోకిల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో 'సెమీ క్రిస్మస్'

సాక్షి, రంగారెడ్డిజిల్లా: క్రైస్తవ జన సమితి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు ఈ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. శాంతి, సమాధానం, ప్రేమను, ఇతరుల పట్ల సోదరభావం కలిగి ఉండాలని క్రీస్తు బోధనలు చెబుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాసారం ప్రేమ్‌కుమార్, టీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేల్పుకొండ వెంకటేశ్, మాంగ్ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంబ్లే శంకర్, క్రైస్తవ జన సమితి నాయకులు నల్ల శివప్రసాద్, శివ, చారి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

గాలింపు చేపట్టిన పోలీసులు





లక్ష్మీప్రణీత, శాన్వీదుర్గప్రసాద్ (ఫైల్)

మీర్‌పేట: ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. బాలాపూర్ చౌరస్తాలోని ఎస్వీ హాస్పిటల్ వైద్యురాలు జ్యోతి కుమార్తె లక్ష్మీప్రణీత (11), బడంగ్‌పేట శ్రీలక్ష్మీహిల్స్‌కాలనీకి చెందిన మహదేవ్‌ప్రసాద్ కుమార్తె శాన్వీదుర్గప్రసాద్ (11) కంచన్‌బాగ్‌లోని బీపీ డీఏవీ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఇద్దరు పాఠశాల నుంచి ఇంటికి వచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు శాన్వీ ట్యూషన్‌కు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వచ్చింది. బాలాపూర్ చౌరస్తాలోని రాధిక ఆస్పత్రి ఎదుట స్కూటీపై ఉన్న ఓ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ తీసుకుని లక్ష్మీప్రణీతకు ఫోన్ చేసింది. అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చిన లక్ష్మీప్రణీత, శాన్వీ ఇద్దరు అదృశ్యమయ్యారు. కుమార్తెలు కనిపించకుండా పోవడంతో ఆందోళన చెందిన ఇరువురి తల్లిదండ్రులు వెంటనే మీర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చాయని.. ఎక్కడికైనా వెళ్లిపోదామని వారిద్దరూ తరగతి గదిలోనే చర్చించుకున్నట్లు సహచర విద్యార్థులు విచారణలో తెలిపారని పోలీసులు చెప్పారు.

ఇద్దరు చిన్నారులకు కోవిడ్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఆగాపుర ప్రాంతానికి చెందిన 14 నెలల చిన్నారికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో రెండు నెలల చిన్నారికి పాజిటివ్ వచ్చింది. దీంతో నిలోఫర్‌లో కోవిడ్ కేసుల సంఖ్య రెండుకు చేరింది. ఇవి పాత వేరియంట్ కేసులా లేక కొత్త వేరియంట్ (జేఎన్-1) కేసులా అని తెలుసుకునేందుకు చిన్నారి రోగుల రక్త నమూనాలను జీనోమిక్ సీక్వెన్స్ సెంటర్‌కు పంపించినట్లు నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు అప్రమత్తం అయ్యారు. ఆసుపత్రిలో ప్రత్యేక కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ఇన్ఫోసిస్ భవనంలో 120 బెడ్ల సామర్థ్యంతో ప్రత్యేక వార్డును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు కోవిడ్ కేసులు పెరిగినా 20 మంది రోగులకు సరిపడా సౌకర్యాలను సమకూర్చినట్లు, అవసరమైతే వార్డును పూర్తిస్థాయిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని డాక్టర్ ఉషారాణి తెలిపారు.

శేరిలింగంపల్లిలో కోవిడ్ పాజిటివ్ కేసు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో కోవిడ్ ఒక పాజిటివ్ కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు. గౌలిదొడ్డికి చెందిన 34 ఏళ్ల వ్యక్తికి కోవిడ్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కాంటినెంటల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు శుక్రవారం శేరిలింగంపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ సీహెచ్ఓ స్వామి తెలిపారు.

నీటి గండం!



పాతాళానికి పడిపోయిన భూగర్భజలాలు

- వేసవిలో నీటి ఎద్దడి తప్పక పోవచ్చంటున్న నిపుణులు
- 2022 నవంబర్‌లో 5.02 మీటర్లు లోతులోనే లభ్యం
- 2023 నవంబర్‌లో 8.28 మీటర్ల లోతుకు పడిపోయిన జలాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వచ్చే వేసవికి జిల్లాకు నీటిగండం పొంచి ఉంది. వర్షాభావం వల్ల గ్రౌండ్ వాటర్ లెవల్ ఆశించిన స్థాయిలో పెరగలేదు. ఫలితంగా జిల్లాలో గత ఏడాది నవంబర్‌లో 5.02 మీటర్ల లోతులోనే లభ్యమైన భూగర్భ జలాలు.. ప్రస్తుతం 8.28 మీటర్ల లోతులో అన్వేశించినా కన్పించడం లేదు. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని సగటు భూగర్భ జలమట్టం లెవల్స్‌తో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలోనే భూగర్భజల మట్టం మరింత లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా నగరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం దారుణంగా పడిపోయింది. శేరిలింగంపల్లిలో గతేడాది నవంబర్‌లో 7.15 మీటర్ల లోతులోనే కన్పించిన నీటి ఆనవాళ్లు.. ప్రస్తుతం 15.96 మీటర్ల లోతుకు పడిపోయాయి. అదే విధంగా ఇబ్రహీంపట్నంలో 6.04 మీటర్ల నుంచి 12.96 మీటర్ల లోతుకు పడిపోయాయి. గత ఏడాదితో పోలిస్తే.. ప్రస్తుతం నీటిమట్టం సగానికి పైగా పడిపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇక చెరువులు, కుంటలు ఎక్కువగా ఉన్న హయత్‌నగర్, గండిపేట్, శంకర్‌పల్లి, తలకొండపల్లి మండలాల్లోనూ భూగర్భ జలాలు భారీగా పడిపోయాయి. వచ్చే వేసవిలో తాగు, సాగు నీటి రంగాలకు ఇబ్బందులు తప్పక పోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడం, ఇంట్లో వృథాగా వదిలే నీటిని ఇంకుడుగుంతలకు మళ్లించడం ద్వారా తాత్కాలికంగా ఈ సంక్షోభం నుంచి బయటపడొచ్చని సూచిస్తున్నారు.

పట్టణాల్లోనే ప్రమాదకరం

విశ్వనగరంగా గుర్తింపు పొందిన గ్రేటర్ హైదరాబాద్ నగరానికి జిల్లా ఆనుకుని ఉంది. 24 గంటల విద్యుత్, తక్కువ ధరలకే కావాల్సినంత భూమి దొరుకుతుండటం, శాంతి భద్రతల సమస్య లేకపోవడం, నైపుణ్యంతో కూడిన ఉద్యోగులు తక్కువ వేతనాలకే పని చేస్తుండటంతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వెతుక్కుంటూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా దేశ నలుమూలల నుంచి నగరానికి వలస వస్తున్నారు. సొంతంగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నగరవాసుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం గోదావరి, కృష్ణా నదుల నుంచి పైప్‌లైన్ల ద్వారా ఇక్కడికి తరలిస్తోంది. ప్రధాన రోడ్లతో పాటు వీధుల్లోనూ తారు, సీసీ రోడ్లు వేస్తున్నారు. వర్షపు చినుకులు భూమిలోకి ఇంకకుండా చేస్తున్నారు. అంతే కాదు భవన యజమానులు నీటికోసం 500 నుంచి వెయ్యి ఫీట్లకు పైగా లోతు బోర్లు వేస్తున్నారు. ఇలా ప్రతీ 50 నుంచి 100 మీటర్ల పరిధిలో ఒక బోరును తవ్వుతుండటం, నిర్మాణ సమయంలో గోడల క్యూరింగ్ కోసం అదే పనిగా నీటిని తోడుతుండడం, ఆ తర్వాత ఇంట్లో నీటి పొదుపును పాటించకపోవడం ప్రధాన కారణం. ఈ ఏడాది నెలకొన్న వర్షాభావానికి తోడు వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి కూడా లేకపోవడంతో భూగర్భజల మట్టాలు మరింత లోతుకుపడిపోయి భవిష్యత్‌లో నీటి సంక్షోభానికి కారణమవుతున్నాయి. సాధారణంగా వ్యవసాయ పొలాల సాగు ఎక్కువగా ఉన్న మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నీడి ఎద్దడి సమస్య ఉండాలి. కానీ పట్టణాల్లోనే భూగర్భ జల మట్టం రోజురోజుకు పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

గ్రేటర్ జిల్లాల్లో భూగర్భజల మట్టాలు (మీటర్ల లోతు) ఇలా

జిల్లాపేరు	2022 నవంబర్	2023 నవంబర్
హైదరాబాద్	3.65	5.12
రంగారెడ్డి	5.02	8.28
మేడ్చల్	4.94	7.30

జిల్లాలో భూగర్భనీటి మట్టం (మీటర్లలో) ఇలా

మండలం	2022	2023
శేర్‌లింగంపల్లి	7.15	15.96
ఇబ్రహీంపట్నం	6.04	12.96
హయత్‌నగర్	3.76	11.55
గండిపేట్	9.68	10.86
తలకొండపల్లి	7.67	10.63
శంకర్‌పల్లి	6.13	10.63
నందిగామ	3.35	9.45
కడ్తాల్	4.49	9.43
చేవెళ్ల	6.54	9.03
నరూర్‌నగర్	5.42	8.99
కొత్తూరు	4.48	8.97
మంచాల	3.55	8.95
రాజేంద్రనగర్	7.85	8.49
షాబాద్	5.52	8.22
చౌదరిగూడ	4.38	7.99
మాడ్గుల	5.12	7.86
బాలాపూర్	3.80	7.70
ఫరూఖ్‌నగర్	5.41	7.89
శంషాబాద్	5.80	7.55
మొయినాబాద్	5.76	6.89
ఆమనగల్	3.16	6.59
యాచారం	3.03	6.17
అబ్దుల్లాపూర్‌మెట్	3.27	5.94
కందుకూరు	1.85	5.78
కేశంపేట్	3.24	3.68



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ భారతిహోళికేరీ

పారిశ్రామికవేత్తలను చేసేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ భారతిహోళికేరీ

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులైన షెడ్యూలు కులాల వారికి టీ ప్రైడ్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి పారిశ్రామికవేత్తలను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ భారతిహోళికేరీ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జిల్లా ప్రోత్సాహక కమిటీ, టీఎస్ ఐపాస్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, దివ్యాంగులకు ఇచ్చే పథకాలపై అధికారులు అప్రమత్తంగా ఉండలన్నారు. టీ ప్రైడ్, టీ ఐడియా పథకాల క్రింద షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారుల కేటగిరిలో ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ సంబంధించిన దరఖాస్తులను, ఎస్సీ, ఎస్టీ కేటగిరి క్రింద వచ్చిన దరఖాస్తులకు కమిటీ అనుమతులు ఇచ్చిందన్నారు. ఆయా పథకాల క్రింద యూనిట్లు పొందిన లబ్ధిదారులు వాటిని నిరంతరం నడుపుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరితహారంపై అధికారులతో సమీక్ష

ఇబ్రహీంపట్నం రూరల్: హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణపై అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భారతి హోళికేరీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2024–25, 2026కు సంబంధించి హరితహారం భవిష్యత్ కార్యాచరణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే రెండేళ్లకు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతలతవ్వకం చేపట్టలన్నారు. మొక్కలు నాటడంతో పాటుగా సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. నాటిన మొక్కలకు జియో ట్యాగింగ్ తప్పనిసరి అని వివరించారు. ఈ సమావేశంలో అటవీశాఖ జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగుతోంది

- 'ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి, లక్ష్య'ను రద్దు చేయాలి
- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి,లక్ష్య కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగి తరగతి గదికి, విద్యార్థులకు దూరమవుతున్నారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆయన డీఈఓ సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం, ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఉన్నతి, పదవ తరగతి విద్యార్థులకోసం లక్ష్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నరన్నారు. ఈ కార్యాక్రమాల వల్ల ఉపాధ్యాయుడు స్వేచ్ఛ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అకడమిక్ సిలబస్ పూర్తి చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డాక్టర్ పరమేశ్, గోపాల్, వెంకటప్ప, రామస్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

అశాస్త్రీయ విధానానికి డీటీఎఫ్ వ్యతిరేకం

ఉన్నతి కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని.. ఈ అశాస్త్రీయ విధానాన్ని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఖండిస్తోందని సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు చంద్రారెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ నాగార్జున రావు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం 2020లో అశాస్త్రీయ విధానాలున్నాయని మేధావులు వ్యతిరేకించారని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలో ఈ కార్యక్రమం ఎలా విజయవంతం చేయాలో అధికారులు పునారాలోచించాలన్నారు.

ధ్యాన జగత్ నిర్మాణమే లక్ష్యం

- పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి
- పుస్తకాలు, క్యాలెండర్ ఆవిష్కరణ



ధ్యాన సందేశమిస్తున్న పరిమళ పత్రి

కడ్తాల్: ధ్యానాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్(పీఎస్ఎస్ఎం) నిరంతరం పనిచేస్తోందని, దివంగత ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చిన్నకూతురు, పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మండల పరిధిలోని మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. ఉదయం 5 నుంచి 8గంటల వరకు సంగీత వేణునాద గానంతో ప్రాతఃకాల ధ్యానం చేశారు. అనంతరం పరిమళ పత్రి మాట్లాడుతూ.. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ కర్నూల్ జిల్లాలో చిన్న సొసైటీగా ప్రారంభమై.. నేడు గ్లోబల్ పీఎస్ఎస్ఎంగా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఎటువంటి తారతమ్యాలు లేకుండా ధ్యానం ఆచరించాలని సూచించారు. పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ధ్యానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ధ్యాన అభివృద్ధి కార్యక్రమాలకు పిరమిడ్ ధ్యానులు అందిస్తున్న సహకారం హర్షణీయమన్నారు. పత్రీజీ పెద్ద కూతురు పరిణీత మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ధ్యానమయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ధ్యాన మహాయాగంలో పత్రిజీ వీడియో సందేశంతో ధ్యాన సందేశం అందించారు. సైంటిస్టు నాగేశ్వర రావు రచించిన మౌన మహా విజ్ఞానం, మిలారెప జీవిత చరిత్ర పుస్తకాలతో పాటు, పీఎంసీ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను పరిమిళ పత్రి, పరిణీత పత్రి ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు, పిరమిడ్ మాస్టర్‌లు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశంతో పాటు ధ్యాన అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు స్వర్ణమాల పత్రి, ట్రస్ట్ సభ్యులు హనుమంతరాజు, సాంబశివరావు, శ్రీరాంగోపాల్, రాంబాబు, హనుమంత రాజు, మేనేజింగ్ ట్రస్టీ బాలకృష్ణ, పీఎంసీ డైరెక్టర్ నవకాంత్, ఆనంద్, లక్ష్మీ, జయశ్రీ, దామోదర్‌రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ సేవలో కర్నాటక చీఫ్ జస్టిస్

మొయినాబాద్: కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రసన్న బి వారలే శుక్రవారం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయన గర్భగుడిలోకి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం స్వామి వారి పట్టు వస్త్రాలు అందజేసి పూల మాలతో ఆశీర్వచనం ఇచ్చారు.

కనకమామిడి వేంకటేశ్వరాలయంలో..

మొయినాబాద్‌రూరల్: కనకమామిడి వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండో రోజు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల అధికారి చిట్ల పార్థసారథి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ మర్రి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ రమేశ్ వారి దంపతులకు ఘన స్వాగతం పలికారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పుష్పయాగంలో పార్థసారథి దంపతులు పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం ఇచ్చారు. శనివారం ఆయన వైకుంఠ ద్వారా దర్శనం తర్వాత ఆయన తిరిగి వెళ్లనున్నట్లు ఆయల చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, పద్మనాభం, పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





స్వామివారి సన్నధిలో హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రసన్న బి వారలే, ఆలయ అర్చకుడు రంగరాజన్, (ఇన్‌సెట్‌లో) వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న పార్థసారథి దంపతులు

మరోసారి బంపర్ ఆఫర్

- ఆన్‌లైన్‌లో ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్
- పెండింగ్ ఈ–చలాన్లకు 60 నుంచి 90 శాతం డిస్కౌంట్
- ఈ 26 నుంచి వచ్చే నెల 10 వరకు నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఈ–చలాన్ జరిమానా బకాయిలు తగ్గించుకోవడానికి అవకాశం కల్పించే ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్ ఈ నెలలో ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దీన్ని నిర్వహించడానికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ–చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాటిలో 91 శాతం ద్విచక్ర వాహనాలు, సామాన్యులకు సంబంధించినవే ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం భారీ డిస్కౌంట్ ఇస్తోంది. గడిచిన కొన్నేళ్లుగా ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో చలాన్లు విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.800 కోట్లు ఈ–చలాన్ బకాయిలున్నాయి. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలోనే వీటిలో 70 శాతం... అంటే దాదాపు రూ.560 కోట్ల మేర పెండింగ్‌లో ఉండిపోయాయి.

- గతంలో ప్రతి ఏడాది ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్‌లు జరిగేవి. 2016 అక్టోబర్ తర్వాత వీటికీ బ్రేక్ పడింది. సుదీర్ఘకాలం తర్వాత గత ఏడాది 45 రోజుల పాటు నిర్వహించారు. దీన్ని మూడు కమిషనరేట్లకు చెందిన 2.92 కోట్ల వాహనచోదకులు వినియోగించుకుని రూ.295 కోట్లు చెల్లించారు. సాధారణంగా మెగా లోక్ అదాలత్ ఒకే రోజు, నిర్దేశించిన ప్రాంతంలో జరుగుతుంది. అయితే ట్రాఫిక్ లోక్ అదాలత్ మాత్రం ఆన్‌లైన్‌లోనే జరగనుంది. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 10 వరకు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా..

వాహన చోదకులు తమ వాహనంపై జారీ అయి ఉన్న పెండింగ్ ఈ–చలాన్ వివరాలు పోలీసు అధికారిక వెబ్‌సైట్లతో పాటు ఈ–చలాన్‌కు సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. వాటిలో ఏర్పాటు చేయబోయే ప్రత్యేక లింకు ద్వారా ఎంటర్ కావాలి. అందులో వాహనం వివరాలు పొందుపరాలి. ప్రత్యేక అప్లికేషన్ డిస్కౌంట్ పోను ఎంత మొత్తం చెల్లించాలో చూపిస్తుంది. అక్కడ నుంచే వివిధ పేమెంట్ గేట్‌వేల్లోకి ద్వారా, ఈ–సేవ, మీ–సేవ కార్యాలయాల ద్వారానూ పేమెంట్లు చేయవచ్చు. తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులపై కేసులు నమోదు చేసే ట్రాఫిక్ పోలీసులు వారికి ఈ–చలాన్ జారీ చేస్తారు. ఆర్టీసీ బస్సులపై జారీ అయ్యే ఈ–చలాన్లను ఆ సమయంలో వాహనం నడిపిన డ్రైవరే చెల్లించాలి.

సమాజహితానికి భగవద్గీత

కన్హాలో గీతోపదేశం

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతి వనంలో గీతా జయంతి సందర్భంగా శుక్రవారం గీతోపదేశ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించారు. టెక్ మహీంద్ర సీఈఓ సీపీ గుర్నానీ, ప్రఖ్యాత పండితుడు ఉదయ శ్రేయస్, ప్రముఖ పారిశ్రామికవేత్త వివేక్ వాధ్వాలు పాల్గొన్న ఈ సమావేశంలో వర్చువల్‌గా పలు దేశాలకు చెందిన సుమారు 2వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమాజంలోని ప్రతి ఒక్కరూ భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. భగవద్గీత పిల్లలకు జీవిత నైపుణ్యాలను పెంపొందింపజేసేందుకు ఎంతగానో కృషి చేస్తుందని వివరించారు. శ్లోకాలను పఠించడంతో పాటు నిరంతరం ధ్యానం చేయడం వల్ల ప్రతి ఒక్క విద్యార్థి సమాజహితం వైపు నడుస్తారన్నారు. అనంతరం శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్(దాజీ) మాట్లాడుతూ.. భగవద్గీత చాలా లోతైన పుస్తకమని, మేధావులు అధ్యాయనం చేశారని అన్నారు. భగవద్గీతను ఆచరణాత్మకంగా తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భగవద్గీతను బోధిస్తున్న ఉదయ శ్రేయస్

హత్యకేసులో జీవితకాల జైలు
రూ.10 వేల జరిమానా
విధించిన కోర్టు

నందిగామ: మహిళను హత్య చేసిన ఘటనలో నిందితులకు జీవితకాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానాను న్యాయస్థానం విధించింది. ఇన్‌స్పెక్టర్ సురేష్ వివరాల మేరకు.. నందిగామ మండలం ఈదులపల్లికి చెందిన బొల్లం రాజేశ్వరి(22)ని ఆమె భర్త ప్రవీణ్, మామ జంగయ్యలు 2017లో హత్య చేశారు. దీనిపై అప్పటి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ కేసు నమోదు చేశారు. సమగ్రంగా విచా రణ జరిపి చార్జిషీట్ సమర్పించారు. కేసు ను ఎల్‌బీ నగర్ కోర్టులో పీపీలు బాల గంగాధర్‌రెడ్డి, రఘులు వాదించి సరైన సాక్ష్యాలను రుజువు చేశారు. దీంతో న్యాయమూర్తి నిందితులకు జీవిత కాలం జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా చెల్లించాలని శుక్రవారం తీర్పు వెలువడిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

PUBLIC NOTICE

Public in general are hereby informed that my client, Mr. Soodini Srujan, Banjara Hills, Hyderabad intends to enter into an agreement of sale with Sri Jillella Bal Reddy S/o. J.Malla Reddy, resident of Nandigama Village & Mandal, Ranga Reddy Dist, T.S., in respect of the agricultural land admeasuring a total extent of Ac.2.20 Gts., (in Sy. Nos.1294/ఉ, admeasuring Ac.0.20 gts, in Sy No.1295/ఆ, admeasuring Ac.1.20 gts., and in Sy.No.1296/ఉ admeasuring of Ac.0.20 Gts.,) situated at Nandigama Village, & Mandal, Ranga Reddy Dist., Telangana. If any-one has any claim, objection or interest in respect of the above said property, he or they may approach the undersigned along with relevant documents within a week from the date of publication of this notice. Any claim thereafter will not be entertained and be deemed as a frivolous one.

Sd/- (B. Ashokvardhan Reddy)
Advocate
Cell: 9246155163

గంజాయి పట్టివేత

- వ్యక్తి అరెస్టు, రిమాండ్
- 18 కిలోలు స్వాధీనం

శంకర్‌పల్లి: గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలోని మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. డిటెక్టివ్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జనవాడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డి నగర్‌లోని సర్వీస్ రోడ్డు వద్ద ఆటోలో గంజాయిని విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఇబ్రహీంబాగ్‌కు చెందిన రాజు సింగ్ 18కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి గంజాయి, ఆటో, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో మోకిల ఎస్ఐ కోటేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

వరిలో సస్యరక్షణ ముఖ్యం

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ
- జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి



గీతారెడ్డి

షాబాద్: రైతులు ఆరుగాలం శ్రమించి పండిస్తేనే సమస్త మానవాళి కడుపు నిండేది. ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి సీజన్ ప్రారంభమైంది. దీంతో అన్నదాతలు దుక్కులు దున్నుతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి వివరించారు.



యాసంగికి సిద్ధమవుతున్న నారు

విత్తన శుద్ధి

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేయాలి. తద్వారా పంటకు పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించవు. కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండైజిమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు 3 గ్రాముల కాస్టస్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకు తినే పురుగు, ఉలికోడు, ముల్ల పురుగు ఆశించకుండా ఉంటుంది.

నారుమడి తయారీ

నారు పోయాల్సిన మడిని పలు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పారించడానికి.. ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి. ఎకరా పొలం నాటడానికి అరగుంటలో 5 కిలోల విత్తనాలు వాడాలి. అరగుంట నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వినియోగించుకోవాలి.

కలుపు నివారణ

నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 మి.లీ, ఒక లీటర్ నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున నీటిని తొలగించి పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు సైహాలోపాస్ బ్యూటైల్ 10 శాతం మందును 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు అరగుంట నారుమడికి 150 గ్రాముల చొప్పున చల్లాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ ఫాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు 20–25 రోజుల వయసు ఉన్నప్పుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.

నాటు వేసే విధానం

నారు ఆకు లేతగా ఉంటేనే చేను తొందరగా పెరుగుతోంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు వాడితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 44 నారు మొలకలు ఉండేలా నాటుకోవాలి.

చలి నుంచి రక్షణ చర్యలు

చలి ప్రభావం నుంచి నారు మడుల్లో ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారుతుంటాయి. దానికి కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- సాయంత్రం వేళలో నీరు తీసి పగటిపూట వెచ్చటి నీరు పారించాలి.
- రోజూ సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు చెక్కలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.
- జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తల్లిని చంపిన కేసులో..

- కొడుకు, కోడలికి జీవిత ఖైదు
- రూ.10వేల జరిమానా

కడ్తాల్: రెండేళ్ల క్రితం మండల పరిధిలోని నార్లకుంటతండా గ్రామ పంచాయతీలో జాతోత్ బిచాలి(58) హత్యకేసులో, కొడుకు కిషన్‌నాయక్ కోడలు విజయలకు జీవితఖైదు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ, ఎల్బీనగర్ కోర్టు తొమ్మిదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీశ్ తీర్పు వెలువరించారని ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ తెలిపారు. కేసుకు సంబంధించి సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని నార్లకుంట తండా గ్రామ పంచాయతీకి చెందిన జాతోత్ బిచాలికి ముగ్గురు కూతుళ్లు, కుమారుడు కిషన్‌నాయక్ ఉన్నారు. భూ తగాదాలు మనస్సులో పెట్టుకుని కుమారుడు కిషన్‌నాయక్, అతని భార్య విజయలు కలిసి 2021, జూన్ 11వతేదీ రాత్రి తల్లి బిచాలిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఇదిలా ఉండగా జూన్ 12వ తేదీ ఉదయం బిచాలి మృతదేహాన్ని చూసిన కూతురు రామవత్ సుశీల తల్లి మృతిపై అనుమానం ఉందని స్థానిక కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ సుందరయ్య కేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసును ఆమనగల్లు సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా నిందితులు అసలు నిజం ఒప్పుకున్నారు. దీంతో బిచాలి హత్య కేసులో కుమారుడు కిషన్‌నాయక్ అతని భార్య విజయలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి కేసు దర్యాప్తు పూర్తయిన అనంతరం వారిపై ఎల్బీనగర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం సాక్ష్యధారాల అనంతరం ఎల్బీనగర్ కోర్టు తొమ్మిదోవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు వెలువరించారు. కిషన్‌నాయక్, కోడలు విజయలకు జీవితకాలపు శిక్ష, రూ.10వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ పేర్కొన్నారు.

సిబ్బందిని అభినందించిన ఉన్నతాధికారులు..

ఈ కేసును దర్యాప్తు చేసిన ఎస్ఐ సుందరయ్య, సీఐ ఉపేందర్‌లను, సరైన సమయంలో సాక్షులను కోర్టు వద్ద బ్రీఫింగ్ చేసిన అధికారులను, హత్య కేసులో నిందితులకు శిక్ష పడటానికి కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘు, ఎస్ఐలు హరిశంకర్‌గౌడ్, పంకజ, ఏఎస్ఐ బాలస్వామి, హెడ్ కానిస్టేబుల్ జానయ్య, కానిస్టేబుల్ రవిలను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారని ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ తెలిపారు.

భార్య మృతికి కారణమైన భర్తకు జీవితఖైదు

కొత్తూరు: పెళ్లైన నెల రోజులకే భార్యను మానసికంగా, శారీరకంగా హింసించి ఆమె మృతికి కారణమైన భర్తకు రంగారెడ్డి జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించినట్లు సీఐ శంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సిద్దాపూర్ పంచాయతీ చింతగట్టుతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్, రజితలకు 2019లో వివాహం జరిగింది. లక్ష్మణ్ భార్యను తీవ్రంగా కొట్టడంతో ఆమె మృతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలి మామ సేవ్యా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిగి నేరం రుజువు కావడంతో 9వ జిల్లా సెషన్స్‌కోర్టు, మెట్రోపాలిటన్ సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి హరీష నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ శంకర్‌రెడ్డి వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండలం, బండి ఎల్కిచర్లకు చెందిన వెంకటేష్(35) ఆయన స్నేహితుడు సతీష్ కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలోని ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. అయితే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను గురువారం రాత్రి కొత్తూరు జాతీయ రహదారి వై జంక్షన్ వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, సతీష్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి
- దండుమైలారంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర




కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి కోరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించారు. ప్రచార రథంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రధానమంత్రి ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ కేంద్ర పథకాలు అందేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్వరి, ఎంపీటీసీ అరుణగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్‌గౌడ్, శ్రీశైలం, యాదగిరిరెడ్డి, దండె శ్రీశైలం, బ్యాంకు మేనేజర్ అనిల్‌రెడ్డి, డీహెచ్‌ఓ ధీరజ్, వ్యవసాయ అధికారి వరప్రసాద్, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

యాదాద్రికి నేతల పాదయాత్ర

'వీర్లపల్లి' విజయంతో మొక్కులు తీర్చుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్ విజయం సాధించడంతో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, అభిమానులు శుక్రవారం తెల్లవారుజామున యాదాద్రికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహస్వామికి మొక్కులు చెల్లించుకునేందుకు నేతలు శేఖర్, అశోక్, సుదర్శన్, అంజి, నర్సింహా, రాజు, శ్రీహరి, జ్ఞానేశ్వర్, శ్రీశైలం, శివ, అజయ్, వంశీ, నరేష్, సుదర్శన్, సతీష్, రమేష్ తదితరులు పాదయాత్ర చేపట్టారు.



పాదయాత్ర చేపట్టిన నాయకులు

పిల్లలతో సహా ఇంటికి చేరిన పరమేశ్వరి

మంచాల: రెండు రోజుల క్రితం ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయిన మైలారం పరమేశ్వరి తమ పిల్లలతో తిరిగి ఇంటికి చేరుకున్నట్లు ఏఎస్ఐ సతీశ్‌కుమార్ తెలిపారు. మంచాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19న ఇంట్లో గొడవ పడి ఇద్దరు పిల్లలను తీసుకొని చెప్పకుండా వెళ్లి పోయింది. దీంతో ఆమె భర్త గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పరమేశ్వరి తమ పిల్లలను తీసుకొని కేసు విషయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి తాను ఎక్కడ ఉన్నాననే వివరాలను తెలియపర్చి తిరిగి ఇంటికి వెళ్లినట్లు ఏఎస్ఐ తెలిపారు.



మంచాల పోలీస్ స్టేషన్‌లో మైలారం పరమేశ్వరి, పిల్లలు

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT L.B.NAGAR
E.P.184/2016 IN A.A.206/2012

Between:
M/s.SHRIRAM TRANSPORT FINANCE COMPANY LIMITED... DHr
And:
Sri.Venkateswara Transport Corporation and another ... JDr's

SALE OF IMMOVABLE PROPERTY

The General Public/ Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable property belonging to Judgment Debtor herein is ordered for Sale in an open court auction, the said auction is to be held on 19-01-2024 in the premises of II Additional District Judge Ranga Reddy District at L.B. Nagar at 10:30 Am.

Therefore whoever is interest in purchasing the said property can attend and participate in the bid which is pen to one and all personally or through an authorized agent.

Conditions of the Sale:

1. The upset price of the said property will be fixed by the Honorable II Additional District Judge, Ranga Reddy District at L.B.Nagar at the time of commencement of Auction.
2. The highest bidder shall be declared to the purchaser of the schedule mentioned property provided always that he is legally qualified to bid and provided that it shall be the discretion of the court or officer holding the sale to be decline acceptance of the highest bid when the price offered appears so clearly indicate as to make it advisable to do so.
3. The Successful bidder shall have to deposit poundage charges @ 3 % of the bid amount immediately after having been declared as the successful bidder in addition to the same, the successful bidder will also have to deposit 25 % of the bid amount on the same day. The poundage charges will be adjusted in the final bid amount.
4. In the event of default of payment of the poundage charges and the 25% of the bid amount, the deposit shall stand forfeited and the successful bidder shall be liable for such action to be taken by the Court as deemed fit and proper.
5. The balance bid amount shall be paid by the successful bidder within fifteen days from the bid failing which the bidder shall be liable for such action to be taken by the court as deemed fit and proper.

SCHEDULE OF THE PROPERTY

Schedules of Immovable Property belongs to 1st JDR Purchased Under Sale Deeds No.4518/2009 & 4519/2009 of SRO Maheshwaram.

SCHEDULE - A:
Ranga Reddy District, Maheshwaram S.R.O. & Mandal, Nagireddipalle Village, Survey No.57/D, 58/F, Agricultural dry land out of an extent of 86 Guntas Agricultural Dry land bounded by
East : Agricultural Land of Sudhakar Reddy and Bhaskar Reddy
South : Agricultural Land of Gollapally Bal Reddy and Srinivas Reddy
West : Agricultural Land of KeshaMallaiah and Medde Mohan Reddy
North : Agricultural Land of Keshani Pentaiah

SCHEDULE - B :
Ranga Reddy District, Maheshwaram S.R.O. & Mandal, Nagireddipalle Village, Survey No.68/5, Agricultural dry land out of an extent of 71 Guntas Agricultural Dry Land bounded by
East : Agricultural Land of K.V.R. Projects Pvt.Ltd
South : Agricultural Land of Pentaiah
West : Agricultural Land of Yadaiah and others
North : Bata

// BY ORDER OF THE COURT//

Sd/-.Y.LAKNA REDDY,
P.ANASUYA GOUD,
RANGA NEHRU,
ADVOCATES.